క్లుప్తంగా

అటవీ సంరక్షణపై దృష్టి సారించాలి

జంగారెడ్డిగూడెం : అటవీ సంరక్షణ, విస్తరణపై అటవీ శాఖ రేంజ్ అధికారులు దృష్టి సారించాలని జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర సూచించారు. శనివారం స్థానిక అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓ కార్యాలయంలో పోలవరం, కన్నాపురం, జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, అమరవరం ఫారెస్ట్ రేంజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ, విస్తరణ నేపథ్యంలో అధికారులు చేపడుతున్న చర్యల గురించి ప్రస్తావించారు. నర్సరీల నిర్వహణ, ప్లాంటేషన్ అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సబ్ డీఎఫ్ఓ సౌజన్య, అటవీ శాఖ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతి



ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు

పోలవరం రూరల్ : ఇటికిలకోట గ్రామంలో సీపీఎం పోలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం అప్‌లాండ్ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ దేశ రక్షణ, ఐక్యత కోసం ఎందరో మహానుభావులు ప్రాణాలు తృణప్రాయంగా అర్పించారన్నారు. భగత్‌సింగ్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు నడవాలన్నారు. నేటి పరిస్థితులను కూడా యువత అర్థం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు బొరగం భూచంద్రరావు, మిడియం గంగాదేవి, గుడెల్లి వెంకట్రావు, తామా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2 నుంచి అయ్యప్ప దేవస్థానం వార్షికోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరించిన అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం అయ్యప్పస్వామి దేవస్థానం 10వ వార్షిక వేడుకలు ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నామని అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురవాయిగూడెం అయ్యప్ప దేవస్థానంలో శనివారం ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ 2న గణపతి పూజ, దశమ ఉత్సవల కార్యక్రమం, 3న కేరళకు చెందిన మధు నంబూద్రిచే తాంత్రిక పద్ధతిలో అయ్యప్ప పడి పూజ, 4న పూర్ణాహుతి, మధ్యాహ్నం నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పారిజాతగిరిలో విశేష పూజలు



జంగారెడ్డిగూడెం : శోభకృత్ నామ సంవత్సర తొలి శనివారం సందర్భముగా గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు, హారతి, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు రాజమండ్రికి చెందిన బలభద్ర వెంకటరాజు దంపతులు, చింతలపూడికి చెందిన తిరుమలశెట్టి వెంకటకృష్ణ నగేష్ దంపతులు సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో మానికల రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్‌రావు, వాసవి నగేష్, కంది బాలకృష్ణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌నకు గూటాల విద్యార్థిని ఎంపిక



ఎంపికైన పాడుం ప్రజ్ఞ

పోలవరం రూరల్ : జాతీయ స్కాలర్‌షిప్‌నకు పోలవరం మండలం గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పాడుం ప్రజ్ఞ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ రాఘవన్ తెలిపారు. ఈ విద్యార్థినికి నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ మంజూరవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రజ్ఞతోపాటు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు హనుమంతరావు, సత్తిబాబు, శర్మ, మహబూబ్‌లను ఆయన అభినందించారు.

కోడి పందేలపై దాడి

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని చెరువుగొల్లగూడెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురిపై శనివారం సాయంత్రం పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు కోళ్లు, రూ.840 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాజేష్ తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న వందనపు సాయిబాల పద్మ



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన గంజిమాల దంపతులు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న చిప్పాడ వెంకన్న

జంగారెడ్డిగూడెం : వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు దెందులూరు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు వందనపుసాయి బాల పద్మ స్వాగతం పలికారు. దెందులూరు హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పూలమొక్కను అందజేసి ఆత్మీయస్వాగతం పలికారు. దెందులూరులో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సమక్షంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు, జంగారెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ నాయకులు చిప్పాడ వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. నాయి బ్రాహ్మణ బార్బర్ షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కొయ్యలగూడెం : దెందులూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎంపీపీ గంజిమాల రామారావు, పశ్చిమ డెల్టా బోర్డు చైర్‌పర్సన్ గంజిమాల దేవి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీ సువర్చల మాత విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన శ్రీ సువర్చల మాత విగ్రహం

కొయ్యలగూడెం : కన్నాపురం గ్రామంలోని పులిరామన్నగూడెం రోడ్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సువర్చలా మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గతంలో ఉన్న హనుమాన్ విగ్రహం చెంతనే అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాన్ని కన్నాపురం గ్రామానికి చెందిన వీరమల్లు దుర్గాప్రసాద్ దంపతులు సౌజన్యంతో నెలకొల్పారు. ఆలయ ధర్మకర్త గడి గోవిందు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

దళిత క్రిస్టియన్ల ఆరాధ్యదైవం జగన్

కొయ్యలగూడెం : దళిత క్రిస్టియన్లకు ఆరాధ్య దైవంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోతారని సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు, రాజవరం సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య పేర్కొన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రాజవరం గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న తుక్కయ్య మాట్లాడుతూ జగనన్నతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీల బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఆయావర్గాల ప్రజలందరూ ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా ఉంటామన్నారు. అలాగే రాబోయే 2024 ఎన్నికల్లో జగనన్న సైనికులుగా కష్టపడి మళ్లీ ఈ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు గుడే వెంకటేశ్వరరావు, తమిర్చి పండు, దుద్దే ప్రసాద్, ఉస్సే ఆంజనేయులు, తమీర్చి వీరయ్య, గృహ సారథులు ఏలేటి మంగ, పేదమూర్తి చంద్ర, కడిమి జ్యోతి పాల్గొన్నారు.



రాజవరం సచివాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ముగిసిన నూకాలమ్మ జాతర

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి 59వ వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం ఉదయం ఆలయ యాగశాలలో ప్రధానార్చకులు యరమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో మహాపూర్ణాహుతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) మాట్లాడుతూ తొమ్మిది రోజుల జాతర మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన దాతలు, భక్తులు, తాండ్ర పాపారాయుడు యూత్ సభ్యులు, ఆలయకమిటీ సభ్యులు, శ్రీనూకాంబికా మహిళా సేవా బృందం సభ్యులు, మహిళలు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఆఖరి రోజు సాందీపనీ విద్యాకేంద్రం విద్యార్థులచే భగవద్గీత పారాయణ సూరంపూడి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈమని శశికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



నూకాలమ్మ ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి

జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

బుట్టాయగూడెం : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన పులిరామన్నగూడెం పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జ్వరాల పరిస్థితిపై డాక్టర్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను సందర్శించి అక్కడ టెస్ట్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నందాపురం పీహెచ్‌సీని కూడా సందర్శించారు. అలాగే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఇక్కడ అందిస్తున్న వైద్యసేవలు, జ్వరాల పరిస్థితులను డాక్టర్ జనార్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను సందర్శించి మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం సీహెచ్‌సీ పరిధిలో 4 మలేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. కంట్రోల్ మేజర్‌మెంట్స్ అమలు చేయాలని ఈ సందర్భంగా సిబ్బందిని ఆదేశించామని చెప్పారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయని వర్షాల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌సీఓ శ్రీనివాస్, సబ్‌యూనిట్ ఆఫీసర్‌లు బి.నాగేశ్వరరావు, వి.పెద్దిరాజు, హెల్త్ అసిస్టెంట్‌లు నాగేంద్ర, బాలాజీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో ల్యాబ్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంఓ ప్రసాద్

పోషకాహారంతో ఆరోగ్య జీవనం

జంగారెడ్డిగూడెం రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా జీవించాలని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా పక్షోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ ఎప్పటికప్పుడు వైద్యులు సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం. మంగతాయారు, పోల్నాటి నాని, రాజా, పారేపల్లి సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడా పక్షోత్సవ వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, సీడీపీవో పి.బ్యూల పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.లక్ష్మీ, పాఠశాల హెచ్ఎం ప్రసూన, జి.విమల, ఎం.సునీత, డి.నాగేశ్వరమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



పశువర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు

బుట్టాయగూడెం : పాడి రైతులు 3 నెలల వయస్సు దాటిన పశువులన్నింటికీ తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గాలికుంటు నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభమైందని చెప్పారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకూ సుమారు నెల రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, తదితర గ్రామాల్లో ఉన్న రైతులు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని అన్నారు. అలాగే తొలిరోజు మూడు నెలలు దాటిన సుమారు 21,460 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో ఈ నెల 28వ తేదీన ఒక సంవత్సంలోపు వయస్సు గల ఆవు, గేదె దూడల ప్రదర్శన, దూడల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లా పశుగణ సంస్థ తాడేపల్లిగూడెం కార్యనిర్వాహణాధికారి బృందం వాటిని పరిశీలించి మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందజేస్తారని పశువైద్యాధికారిణి జె.లక్ష్మీప్రసన్న తెలిపారు.

అనధికార నిర్మాణం కూల్చివేత

జంగారెడ్డిగూడెం : అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ శాఖ ద్వారా అటువంటి నిర్మాణాలను కూల్చివేయడం జరుగుతుందని కమిషనర్ పి.భవానీప్రసాద్, టీపీవో వి.జగదీష్ తెలిపారు. శనివారం పట్టణంలోని కేశవపల్లి వారి వీధిలో అనుమతులు లేకుండా భవనంపై నిర్మిస్తున్న షెడ్డును మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశవపల్లి వారి వీధిలో నివాసం ఉంటున్న చేబ్రోలు అంజనరావు ఇంటికి జి ప్లస్ టూ నిర్మాణానికి మాత్రమే అనుమతులు ఉన్నాయని, మూడవ ఫ్లోర్ కింద షెడ్డును అనధికారికంగా నిర్మిస్తున్న నేపథ్యంలో తమ సిబ్బందితో వెళ్లి తొలగించామన్నారు. కాగా అక్రమ నిర్మాణాలు తొలగిస్తుండగా, అక్కడే వీధుల్లో ఉన్న 2వ సచివాలయం పరిధిలోని ఆ ప్రాంత వార్డు ప్లానింగ్ కార్యదర్శి చంద్రిక ఆందోళనకు గురై కళ్లు తిరిగి అపస్మారక స్థితికి చేరుకుందని టీపీవో జగదీష్ తెలిపారు. వెంటనే ఆమెను కమిషనర్ వాహనంలో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించామని, ప్రస్తుతం ఆసుపత్రిలో ఆమె కోలుకుంటుందని చెప్పారు.



అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మాధవకుంట పుష్కరిణి పరిశుభ్రతకు చర్యలు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలోని తూర్పువీధిలో ఉన్న మాధవకుంట పుష్కరిణి పరిశుభ్రతకు ఆలయ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. పుష్కరిణిలో పేరుకుపోయిన నాచు, చెత్త చెదారాన్ని సిబ్బంది తొలగిస్తున్నారు. ఈ పనులు మరో నాలుగు రోజులపాటు జరుగనున్నాయి. ఐదేళ్ల క్రితం సుమారు రూ.1.50 కోట్లతో దీన్ని అభివృద్ధి చేశారు. అయితే నిర్వహణ లోపాల కారణంగా పుష్కరిణి అస్తవ్యస్తంగా మారింది.



మాధవకుంట పుష్కరిణిలో పేరుకున్న నాచు, చెత్తచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

రైతులను ఆదుకోవాలని ఎంపీకి వినతి

జంగారెడ్డిగూడెం రూరల్ : ఇటీవల సంభవించిన ఈదురుగాలుల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ జంగారెడ్డిగూడెం మండలం ఎ. పోలవరానికి చెందిన రైతులు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుకి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం ఏలూరులో ఎంపీ శ్రీధర్‌బాబుని రైతులు కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. వడగళ్లు, ఈదురుగాలులకు 500 ఎకరాల్లో పొగాకు తోటలు, 200 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో నిమ్మతోటలు దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు రైతులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. బ్యారన్‌పై కప్పులు తీవ్రమైన ఈదురు గాలులతో ఎగిసిపడి తీవ్ర నష్టాన్ని రైతులకు మిగిల్చిందన్నారు. ఒక ఎకరం పొగాకు తోటకు రూ.లక్షా 50వేల పెట్టుబడులు పెట్టారని, పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలు వర్షం భారీ నష్టాన్ని మిగిల్చిందని ఎంపీ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని రైతులు ఎంపీని కోరగా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

నానో టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నానో టెక్నాలజీ పరిచయం అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక అనేక పరిశోధనలకు పునాది నానో శాస్త్రం అని, ఈ శాస్త్ర అధ్యయనం మూలంగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అన్నారు. ముఖ్య వక్త హైదరాబాద్ జే.ఎన్.టీయూ ఆచార్యులు, నానో శాస్త్ర విభాగ అధ్యక్షుడు డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యూషన్స్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నానో పదార్థంగా గుర్తించే అంశాలు, నానో శాస్త్రంలోని మౌలిక అంశాలు, నూతన పరిశోధనలు, దీని మూలంగా వికసించిన విప్లవాత్మకమైన మార్పులను విద్యార్థులకు వివరించారు. నానో శాస్త్రంలో భాగంగా మనం ధరించే వస్త్రాలలో నూతన ఆవిష్కరణ కారణంగా వస్తున్న మార్పులను వివరిస్తూ ఉతకడం, ఇస్త్రీ అవసరంలేని వస్త్రాలు, కడగడం అవసరంలేని పాత్రలు, మొదలైన మార్పులను వచ్చాయన్నారు. ప్రకృతిలోని సహజసిద్ధమైన చర్యల ఆధారంగా నానోశాస్త్రంలో పరిశోధన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మరో వక్త గీతం విశ్వవిద్యాలయ పరిశోధకులు చేబ్రోలు ప్రసాద్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు బొగ్గల వెంకటేశులు రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు వారి సందేహాలను ప్రధాన వక్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నానో టెక్నాలజీపై సెమినార్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్త్ అవర్‌పై అవగాహన ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మార్చి నెల చివరి శనివారం నిర్వహించే ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నగరంలో ఎర్త్ అవర్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని విద్యుత్ ఉపకరణాలను ఒక గంట పాటు ఆపివేసి ఎర్త్ అవర్ పాటించాలని, విద్యుత్ పొదుపుతో భూమిని, పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థంగా మారినందున భూమిని కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్థానిక అమీనాపేటలోని బాలయోగి సైన్స్ పార్క్ నుంచి హాస్టల్ ప్రాంగణాల వరకు ఏలూరు పట్టణంలోని వివిధ పాఠశాలల ఎకో క్లబ్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులు చేతబట్టి నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. గ్రీన్ టీచర్లు రెడ్డి రామారావు, హాస్టల్ వార్డెన్లు ఆర్ఎస్ మంగళ, వై.పద్మజ పాల్గొన్నారు.

కేబుల్ వైర్లతో ప్రజలకు సమస్యలు

కొయ్యలగూడెం : విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్ల ఏర్పాటుతో సమస్యలు ఏర్పడుతున్నాయని రాష్ట్ర కన్స్యూమర్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు ఏఆర్‌కే హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా వారికి లేఖలు పంపించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించకుండా కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలకు వైర్లను, బాక్సులను ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరా వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురవుతున్నాయని, తిరిగి పునరుద్ధరించుకునేందుకు వినియోగదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్కువ ఎత్తులో వైర్లను లాగడం వల్ల ఇంటి నిర్మాణాలకి అడ్డువస్తున్నాయని తొలగించమంటే కేబుల్ నిర్వాహకులకు ప్రజలకు మధ్య గొడవలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కేబుల్ ఆపరేటర్లు వ్యవహరిస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేస్తూ కలెక్టర్‌కి, ఎలక్ట్రికల్ ఎస్ఈ, డీఈలకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సీఎం సభలో సందడి



సభా ప్రాంగణంలో సీఎం జగన్ కటౌట్‌తో సందడి

బుట్టాయగూడెం : అక్కచెల్లెమ్మల కోసం వైఎస్సార్ ఆసరా పథకం సొమ్ముల విడుదలకు దెందులూరులో ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా ఆ కార్యక్రమానికి మండలం నుంచి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు కుంజా దుర్గమ్మ, పెడకం విజయలక్ష్మి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌ను పట్టుకుని సభాప్రాంగణం వద్ద జై జగన్ నినాదాలు చేస్తూ సందడి చేశారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గల బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో గల గిరిజన సంక్షేమ ఏకలవ్య గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి, ఖాళీగా ఉన్న 8వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ పీవీఎస్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బాలికలు – 30 సీట్లు, బాలురు – 30 చొప్పున మొత్తం 60 సీట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ఏకలవ్య గురుకుల పాఠశాల ఇప్పలపాడులో ప్రవేశ పరీక్ష జరుగుతుందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.